
# ప్రత్యేకహోదా తిరస్కరణ

- ప్రభుత్వాల నయవంచన




**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటి

# ప్రత్యేకహోదా తిరస్కరణ

## ప్రభుత్వాల నయవంచన

**ఆంధ్ర ప్రదేశ్ ప్రజలను ఆందోళనకు, అసంతృప్తికి, ఆవేదనకూ గురి చేస్తున్న సమస్య ప్రత్యేక తరహా హోదా.**

**విభజన గాయాల నుంచి కోలుకోవడానికి ఉపయోగంగా, ఉపశమనంగా వుంటుందనుకున్న ఒక ఏర్పాటు ఈ ప్రత్యేక హోదా. అయితే ఆ హోదా తెచ్చామని గొప్పలు చెప్పిన వారే కేంద్రంలో గద్దెక్కిన తర్వాత వెన్నుపోటు పొడిచిన తీరు ప్రజలను విపరీతంగా బాధిస్తున్నది.**

**ప్రత్యేకహోదా నిరాకరించడమే గాక వంకర వాదనలతో అవమానిస్తున్న బిజెపి సీనియర్ మంత్రి వెంకయ్యనాయుడును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సత్కారాలతో వూరేగించడం ప్రజలకు మరింత వెగటు పుట్టిస్తున్నది.**

మా తెలుగుతల్లికి మల్లెపూదండ అని పాడేవారే మాయ చేసిన దారుణం ఇది.

రాజకీయ విలువలకు పాతర. రాజ్యాంగ దగా ఇది.

హోదా ఇచ్చే అవకాశం లేనందువల్లనే ఇవ్వలేకపోయామని పదేపదే పల్లవి ఆలపిస్తున్న కేంద్ర ప్రభుత్వాధినేతల మాటలు ప్రజల ఇంగిత జ్ఞానాన్ని పరిహాసం చేస్తున్నాయి.

హోదా ముగిసిపోయిన కథ అని వారే ప్రకటిస్తుంటే ఆమోదించడానికి ఆత్మగౌరవం రాజకీయ చైతన్యం అంగీకరించడం లేదు. ఎందుకంటే, తెలుగు ప్రజలు ఎప్పుడూ చేవ చచ్చిన వారో చేతకాని వారో కాదు. చైతన్య వంతులు. సమరశీల సంప్రదాయాలున్నవారు. చరిత్రనే మార్చిన వారు. నిజానిజాలను నిశితంగా పరిశీలించగలిగిన వారు. నిక్కచ్చిగా నిలచి పోరాడే వారసత్వం వారి స్వంతం.

**మా వూళ్లో కొంతమంది కాకా/ రాయుళ్లున్నారు వాళ్లు బాకా/ బాగా పడతారు కాని అదంతా కా/వలసింది సాధించుకునే దాకా/ ఆపై ఇస్తారు ధోకా**

ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేక హోదా/ ప్యాకేజీపై 2016 సెప్టెంబరు 7 అర్థరాత్రి అరుణ్‌జైట్లీ అండ్ కో కుతంత్రం శ్రీశ్రీ 'పంచతంత్రం'లోని పై చరణాలను గుర్తుచేస్తుంది.

**అదేపార్టీలూ అదే నాయకులూ! కాని ప్రత్యేక హోదా ప్రత్యేకధోకాగా మారిపోయింది. ఏమీలేని దానికి, ఏమీ చేయని దానికి ఇంతోటి నాటకం దేశంలో ఇదే ప్రథమం కావచ్చు.**

**ఒక విభజిత క్షుభిత రాష్ట్రం విషయంలో ఇంత బాధ్యతా రాహిత్యం అన్యాయమే కాదు అమానుషం కూడా.**

**2**

ఎన్నికల వాగ్దానాలు, ఉల్లంఘనలూ ఈ దేశంలో మామూలే.

కాని ఆంధ్ర ప్రదేశ్ విభజన అనే ఒక ఉద్విగ్న ఉద్వేగ భరిత చారిత్రిక సన్నివేశంలో పెద్దల సభ సాక్షిగా అందరికన్నాపెద్ద హోదాలో వున్న ప్రధానమంత్రి ప్రధాన ప్రతిపక్షం అభ్యర్థనతో, ఆమోదంతో చేసిన అధికారపూర్వక ప్రకటన.

అదే ఇంత దుర్గతి పాలవడం సిగ్గుచేటు.

ఫ్లాప్ సినిమాకు పక్కా స్క్రీన్‌ప్లే అన్నట్టు ఈ తిరస్కరణ ప్రక్రియ ప్రధాన సూత్రధారులు సీనియర్ కేంద్ర మంత్రి వెంకయ్యా నాయుడు, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.

అధికారిక ప్రకటన కర్త ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ.

సంధాన కర్తలు, సుజనా చౌదరి వంటివారు.

అగోచర అంతిమ నిర్ణేత ప్రధాని నరేంద్ర మోడీ .

అమరావతి శంకుస్థాపనకు వచ్చిన మోడీ మట్టి నీళ్లతో సరిపెట్టగా, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్యాకేజీ మాత్రమే అడిగినప్పుడే ఈ నాటకం తొలి అంకం పూర్తయిపోయింది.

మలిశంకుస్థాపనకు వచ్చిన అరుణ్‌జైట్లీ ఆ విషయాన్ని పూర్తిగా భూస్థాపితం చేశారు.

ప్రత్యేక హోదా రాలేదని విమర్శించే వారంతా అసూయాపరులు, ఏడుపుగొట్లు, నిత్యశంకితులు, పరాన్న జీవులు అంటూ వెంకయ్య నాయుడు పంచతంత్రాన్ని ఉటంకించి మరీ పరిహాసమాడారు.

ఆంధ్ర ప్రదేశ్ ప్రజల ఆవేదన ఆయనకు అంత ఘోరంగా కనిపించింది.

హోదాకన్నా మించి ప్యాకేజీ ఇచ్చామని ఆయనే గొప్పలు చెప్పారు.

హోదా అనేది సెంటిమెంటు కాదు, ఆయింటు మెంటు కాదు, కమిట్ మెంటు.

హోదా వల్ల వచ్చేది ఎంత, ప్యాకేజీ వల్ల గిట్టేది ఎంత అనే అసందర్భ వాదనల సంగతి తర్వాత. ఎపికి ఇప్పటి వరకూ ఎంత ఇచ్చారనే లెక్కలు చూసుకోవచ్చు గాని అసలు ఇచ్చిన మాట ఎందుకు తప్పుతున్నారనేది పెద్ద సవాలు.

**3**

వెనకటికొకడు తల్లిని చంపేసి తల్లిలేని పిల్లవాణ్ని గనక శిక్ష తగ్గించమని కోరిన కథ గుర్తుకు వస్తుంది వీరి విన్యాసాలు చూస్తుంటే.

హోదా ముగిసిన అధ్యాయం ఇంకా దానిపై మాట్లాడ్డమెందుకు అనేది ఈ బిజెపి టిడిపి నేతలు బృందగానం.

ఎక్కడ ఎప్పుడు ముగిసింది?

**ఇప్పటికీ పదకొండు రాష్ట్రాల ప్రత్యేక హోదా కొనసాగుతూనే వుంది. వచ్చే ఏడాది చివరి వరకూ వుంటుంది. కాబట్టి ముగిసిందనడం నిజం కాదు.**

**ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వరంటే 14 వ ఆర్థిక సంఘం వద్దన్నదని ఒక అర్థం లేని వాదన. విభజన బిల్లు 2014 ఫిబ్రవరిలో ఆమోదించారు. ఆర్థిక సంఘం 2013 జనవరిలో ఏర్పాటైంది. దానికి ఇచ్చిన ప్రస్తావనాంశాలలో (టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్) హోదా విషయమే లేదు. ఆ సంఘం అధ్యక్షుడుగా పనిచేసిన తెలుగు ప్రముఖుడు, రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ వైవిరెడ్డి స్వయానా చెప్పారీ మాట. అయినా అదే అరిగిపోయిన రికార్డు.**

నిజానికి ఆర్థిక సంఘం ఎప్పుడైనా కేటాయింపులు నిర్ణయిస్తుందే తప్ప ప్రత్యేక హోదానా కాదా అనేది ప్రస్తావించదు. కావాలంటే పాత నివేదికలు చూడొచ్చు.

ఎందుకంటే ఆ బాధ్యత ప్రణాళికా సంఘం నిర్వహిస్తూ వచ్చింది.

ప్రణాళికా సంఘం చూడాలి గాని అది రద్దయిపోయింది ఏం చేస్తామని కేంద్ర నేతల మరో నిట్టూర్పు. రద్దు చేసింది మీ మోడీ ప్రభుత్వమే కదా?ప్రభుత్వ వ్యవహారాలలో ఏదైనా వ్యవస్థను రద్దు చేస్తున్నప్పుడు దానివల్ల ప్రయోజనం పొందేవారికి ముందు భద్రత భరోసా కల్పించడం జరుగుతుంటుంది. లేకపోతే న్యాయస్థానాలు కూడా ఒప్పుకోవు .

ప్రణాళికా సంఘం స్థానంలో తాము తెచ్చిపెట్టిన నీతి ఆయోగ్ నిర్ణయం తీసుకుంటుందని చాలా కాలం చెప్పారు. చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు

కూడా అదే నమ్మకంగా ప్రకటించారు. దాని అధ్యక్షుడు స్వయానా ప్రధాని మోడీనే.మరెందుకు మొండి చెయ్యి చూపించారు?

ఆ నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగారియా తమకూ హోదాకు ఏ సంబంధం లేదని హైదరాబాదులోనే చెప్పేశారు.

ఇవన్నీ గాక పసలేని మరో ప్రచారం – ప్రత్యేక హోదా వల్ల ప్రయోజనం వుండదు. హోదా వున్న రాష్ట్రాలకు పెద్దగా ఒరిగింది లేదు.

వచ్చేది పోయేది ఏమీ లేకపోతే ఇచ్చేస్తే సరిపోతుంది కదా! హోదా కన్నా మిన్నగా ప్యాకేజీ ఇచ్చి కేంద్రంపై భారం పెంచుకోవడమెందుకు?

ప్రజల నుంచి ప్రతిపక్షాల నుంచి ఇలాటి ప్రశ్నలు వచ్చిన కొద్దీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అసత్యాల ప్రవాహం ఇంకా ఇంకా ఉధృతమవుతుంది.

ఎందుకంటే – తాము చెప్పేది నిజం కాదని వారికే బాగా తెలుసు.

## 4

**లోక్‌సభలో రభస మధ్య విభజన బిల్లు ఆమోదించినట్టు ప్రకటించిన తర్వాత రాజ్యసభకు వచ్చింది. ఆ చర్చలో భాగంగా అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ విభజన చట్టంలోని విషయాలు గాక అదనంగా ఒక ప్రకటన చేస్తున్నట్టు చెప్పారు.** ఇదంతా పూర్తిగా తన ఖాతాలో వేసుకుని రాజ్యసభలో తానే మహత్కార్యం సాధించినట్టు చెప్పే వెంకయ్య నాయుడు లోక్‌సభ ఆమోదంలో బిజెపీకీ పూర్తిబాధ్యత వుందనేదాన్ని దాటేస్తుంటారు. టిడిపి నేతలు కాంగ్రెస్‌నే విమర్శిస్తూ బిజెపి పాత్రను మరుగుపర్చడం కుదిరేపని కాదు. బిజెపి వారు నిజంగా అంత గొప్పగా ఆలోచిస్తే లోక్‌సభలోనే అడిగి వుండేవారు. ఏమైనా 2014 ఫిబ్రవరి 23న ప్రధాని మన్మోహన్ రాజ్యసభలో చేసిన ఆ ప్రకటనలో ప్రత్యేక హోదా ఒక అంశమే. మరో ఆరు విషయాలుదానిలో వున్నాయి.

ఆ ప్రకటనలో ఇలా వుంది:

**మొదటిది:** కేంద్ర సహాయంలో భాగంగా నాలుగు జిల్లాల రాయలసీమ, మూడు జిల్లాల ఉత్తరాంధ్రతో సహా 13 జిల్లాలతో ఏర్పడే ఆంధ్ర ప్రదేశ్‌కు అయిదేళ్లపాటు ప్రత్యేక తరహా హోదా కల్పించడం జరుగుతుంది. దీనివల్ల రాష్ట్ర ఆర్థిక వనరులు బలోపేతమవుతాయి.

**రెండవది:** కేంద్ర ప్రభుత్వం తగిన ఆర్థిక చర్యలు తీసుకుంటుందని ఇప్పటికే బిల్లు స్పష్టం చేస్తున్నది. అందులో కొత్తగా ఏర్పడిన రాష్ట్రాల్లో పారిశ్రామికీకరణ ఆర్థికాభివృద్ధిని పెంపొందించేందుకు పన్ను ప్రోత్సాహకాలు కల్పిస్తామన్న ప్రతిపాదన కూడా వున్నాయి. కొన్ని ఇతర రాష్ట్రాలకు కల్పిస్తున్న ప్రోత్సాహకాల

మాదిరే ఇవి వుంటాయి.

**మూడవది:** ప్రధానంగా రాయలసీమ, ఉత్తరకోస్తా జిల్లాలతో సహా కొత్తగా ఏర్పడే ఆంధ్ర ప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ కల్పించే ప్రతిపాదన బిల్లులో ఇప్పటికే వుంది. ఈ అభివృద్ధి ప్యాకేజి ఒడిషాలో కెబికె(కోరాపుట్ – బొలాంగిర్ – కలహంది) ప్రత్యేక ప్రణాళిక, మధ్య ప్రదేశ్, యుపిలలో బుందేల్‌ఖండ్ ప్యాకేజి తరహాలో వుంటుంది.

**నాల్గవది:** పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి పునరావాస ప్యాకేజి సాఫీగా పూర్తిగా అమలు అయ్యేందుకు వీలుగా ఇంకా ఏమైనా సవరణలు అవసరం అయితే వాటిని సాధ్యమైనంత త్వరలో అమలు చేస్తాం. మా ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును అమలు చేస్తుందన్న విషయంలోఎలాంటి సందేహం అవసరం లేదు

**అయిదవది:** సిబ్బంది ఆర్థిక వనరులు ఆస్తులు అప్పుల పంపిణీ సంతృప్తికరంగా జరిగేందుకు వీలుగా నోటిఫైడ్ తేదీకి అనుగుణంగా కొత్త రాష్ట్ర నియామక తేదీని ప్రకటించడం జరుగుతుంది

**ఆరవది:** కొత్తగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్‌కు వనరుల లోటు మొదటి ఏడాది నుంచే ఏర్పడవచ్చు. ముఖ్యంగా నియామక తేదీ నుంచి 14వ ఆర్థిక సంఘం సిఫారుసులు అమలు చేసేలోపు ఈ లోటు వుండే అవకాశం వుంది. ఈలోటును 2014–15 సాధారణ కేంద్ర బడ్జెట్‌లో భర్తీ చేయడం జరుగుతుంది.

ఇవన్నీ చెప్పిన తర్వాత **ముగింపులో మన్మోహన్ అన్న మాట మరింత ముఖ్యమైనది. "ఈ చర్యల ద్వారా మేము కేవలం తెలంగాణ ఏర్పాటుకే గాక సీమాంధ్ర సౌభాగ్య సంక్షేమాలకు గట్టిగా కట్టుబడివున్నామని తెలియజేయదలచాము" అని పేర్కొన్నారు.**

ఆ రోజున ప్రధాని మన్మోహన్ ఈ ప్రకటన చేసిన వెంటనే వెంకయ్య నాయుడు తీవ్ర వాదన పెట్టుకున్నారు. ప్రత్యేక హోదా పదేళ్లు వుండాలనేది ప్రజల డిమాండు అన్నారు. 'బిల్లులో సాధ్యాసాధ్యాలు పరిశీలించి', వంటి పదాలు వుండటంపై అభ్యంతరం చెప్పారు. మొదటి ఏడాది రెవెన్యూ లోటు లెక్కలు వంటివి తేల్చడం ఆలస్యం అవుతుంది గనక పదివేల కోట్ల రూపాయల కన్సాలిడేటెడ్ ఫండ్ ఇవ్వాలని కోరారు. చివరకు 'ఏమైనా మేము మరో రెండు నెలల్లో అధికారంలోకి వస్తున్నాం. నేను మరింత రెట్టించదల్చుకోలేదు' అన్నారు.

## 5

ఆ బిల్లు ఆమోదం పొందిన తర్వాత మార్చి 1 కేబినెట్ సమావేశంలో ప్రధాని ప్రకటనలోని హామీల అమలుకు ఉత్తర్వులిచ్చారు. అప్పటికే ఎన్నికల ప్రకటన జరిగింది గనక దాన్ని అమలు చేయలేదు గాని ప్రక్రియ మొదలైందనడానికి ఇది నిదర్శనం. ప్రధాని హామీకి చట్టబద్ధత లేనందువల్ల ఏమీ చేయలేకపోయామనే వాదన శుద్ధతప్పు. పోనీ అదే నిజమైతే ఇప్పుడు చట్టబద్ధత కల్పించే అవకాశం అధికారం ఎన్నికల విజయం సాధించిన బిజెపి సర్కారుకు వచ్చింది. ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా వున్న తెలుగుదేశం ఎపిలో అధికారం చేపట్టింది. అప్పుడు రాజ్యసభలో ప్రతిపక్ష నేత అరుణ్‌జైట్లీ ఇప్పుడు ఆర్థిక మంత్రి అయ్యారు. అప్పుడు మాటిమాటికీ లేచి ఎపికోసం ఏదో పట్టుపట్టినట్టు మాట్లాడిన వెంకయ్య నాయుడు మరో సీనియర్ మంత్రి అయ్యారు. ఆ బిల్లు ఆధారంగా కేంద్రం ఏడు మండలాలను ఆర్డినెన్సు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో చేర్చింది. కాని నిధులు ప్రత్యేక హోదా విషయం మాత్రం చట్టంలో లేవంటూ ఎగనామం పెట్టడానికి రంగం సిద్ధం చేసింది. దీనికి ఆధ్వర్యం వహించింది వెంకయ్య నాయుడే!

మొట్టమొదటగా ఆయనే విజయవాడలో హోదాకు సూదితో బెజ్జం చేసి మానసిక క్రీడ ప్రారంభించారు.

అందుకే వెంకయ్య మాట తప్పి బొంకయ్య అనిపించుకున్నారు.

. దాన్ని గట్టిగా ఖండించకుండా హెూదా సంజీవిని కాదంటూ సన్నాయి నొక్కులు నొక్కింది చంద్రబాబు నాయుడు.

అది ఆకస్మికంగా జరిగిందేమీ కాదు. వారు కూడబలుక్కుని అనుకుని చేసిన నిర్వాకమే. మోడీ అమరావతి రాక సందర్భంలోనూ ప్రత్యేక హోదా అడగబోమని ముందే హామీ ఇచ్చినట్టు చెబుతుంటారు. అందుకే అడగలేదు కూడా.

## 6

ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు 2016 జులైలో ప్రత్యేక హోదాపై ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టారు. అయితే కేంద్రం దాన్ని రాజ్యాంగ బిల్లుగా గాక ద్రవ్యబిల్లుగా అసంబద్ధమైన నిర్ణయం చేసింది.ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంపై చర్చ అంటూ మొదటే హోదా అంశాన్ని మినహాయించి మిగిలిన ఏవేవో విషయాలపైకి చర్చ మరల్చింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తాను ఆ రోజున చేసిన ప్రకటనలో ఏముందో ఎలా జరిగిందో వివరించారు.

ఆ చర్చలో పాల్గొన్న 18 పార్టీలు టిఆర్ఎస్, సమాజ్‌వాది, బిజెడి, టిఎంసిలతో సహా హోదాకు ఎలాంటి వ్యతిరేకత చెప్పకపోయినా ప్రభుత్వం మాత్రం అదృశ్య

శక్తులేవో అభ్యంతరపెడుతున్నట్టు నమ్మించే ప్రయత్నం చేసింది. టిడిపి బిజెపి 'పెద్దదిక్కు' వెంకయ్య నాయుడు నేనసలు ఎపిలో గాక తెలంగాణలోనే ఎక్కువ కాలం వున్నానని అసందర్భ వాదన చేశారు. తాము ఆదినుంచి విభజన కోరుతున్నామని కూడా చెప్పేశారు.

తెలుగుదేశం ఎంపిలు సిఎం రమేష్ వంటి వారు ఆచితూచి కాంగ్రెస్ కేంద్రంగా విమర్శలు చేశారు. మంత్రి సుజనా చౌదరి ప్రశ్నలు వేసినా తర్వాత అరుణ్‌జైట్లీ ప్రసంగానికి చప్పట్లు కొట్టి విమర్శలు తెచ్చుకున్నారు. ఇదంతా రాజకీయ నాటకంగానే నడిచింది. ఓటింగు జరిగితే ఎవరు ఎటువైపో తెలిసిపోతుంది గనక చివరకు ఓటింగు లేకుండా చేసుకున్నారు.

చర్చకు సమాధానమిచ్చిన **అరుణ్‌జైట్లీ విభజన చట్టంలోని ఏవేవో అంశాలను ఏకరువుపెట్టారే గాని ప్రత్యేక హోదా ఇవ్వడానికి తాము ఏ ప్రయత్నాలు చేశారో 18 పార్టీలు బలపర్చినా ఎందుకు ఇవ్వడం లేదో చెప్పలేదు. 14వ ఆర్థిక సంఘం 32 శాతం నిధులను 42 శాతానికి పెంచింది గనక ప్రత్యేక సహాయం ఎత్తివేశామని అరుణ్‌జైట్లీ రాజ్యసభ చర్చలో అదేపనిగా వాదించారు. వాస్తవంలో రాష్ట్రాలకు కేటాయింపు జిడిపిలో శాతంగా చూసినప్పుడు కొన్ని పాయింట్లు తగ్గింది.**

**ఉమ్మడి రాష్ట్రానికి కేంద్ర వనరులలో 6.937 శాతం వస్తే ఇప్పుడు ఎపికి 4.305, తెలంగాణకు 2.437 శాతం మాత్రమే సిఫార్సు చేసింది. అంతేగాక కేంద్ర పథకాలు నిధుల కేటాయింపును పూర్తిగా రద్దు చేశారు గనక ఆ భారం కూడా రాష్ట్రాలే మోయాల్సి వుంటుంది. ఆ చర్చలో జైట్లీ ఎపికి రెండు లక్షల అరవై తొమ్మిది వేలకోట్లు ఇస్తున్నామని చెప్పి తర్వాత ఆ సంఖ్యను రెండు లక్షల ఆరు వేల కోట్లు అని జైట్లీ సవరించుకున్నారు. అమరావతికి వచ్చినపుడు మరో మూడు వేల కోట్లు తనే తగ్గించుకున్నారు. ఆర్థిక మంత్రే ఇన్ని అంకెలు చెబుతున్నారంటే అవాస్తవం గనకే! వాస్తవంగా రూ॥1,69,969 కోట్లు మాత్రమే కేటాయించారు.** దీనికి రెవెన్యూ లోటు కింద అయిదేళ్లలో రూ॥22,113 కోట్లు, తుఫానుల సాయం కింద రూ॥2,492 కోట్లు, స్థానిక సంస్థల కింద మరికొంత మొత్తం కలిపి ఆయన సభను పక్కదోవ పట్టించారు. ఇవన్నీ సిపార్సులు మాత్రమే. మంజూరైనవి కావు. మేము పాలించే రాష్ట్రం గనక ఎక్కువ ఇవ్వలేమనీ, నిబంధనల ప్రకారమే వెళ్లవలసి వుంటుందని గంభీరోక్తులు పలికారు. ఆ మాటల్లో అత్యధికం అవాస్తవాలు.

ఈ చర్చలో సిపిఎం నేత సీతారాం ఏచూరి మాట్లాడింది చాలామందికి నచ్చింది. రాష్ట్ర విభజన సమస్యపైనా అనంతర పరిష్కారాలపైనా సుస్పష్టంగా

మాట్లాడుతున్నది సిపిఎం ఒక్కటేనని అంగీకరించాల్సి వచ్చింది. ప్రత్యేక హోదా విషయంలో వాగ్దానభంగం సరికాదని కూడా ఆయన చేసిన హెచ్చరిక చాలా అర్థవంతమైంది. నిజంగానే అత్యున్నతమైన పార్లమెంటులో అందునా ఎప్పటికీ వుండే ఎగువ సభలో ప్రధాని ఇచ్చిన మాటకే విలువలేకపోతే ఇంకేం ప్రజాస్వామ్యం?

**7**

ప్రజలకు వాగ్దానం చేసిన ప్రత్యేక హోదా నిరాకరణ పాపం ముమ్మాటికీ మోడీ ప్రభుత్వానిది. ఇతర రాష్ట్రాల విషయంలో కూడా ప్రస్తుత ప్రధాని ఇలాగే కేంద్రీకృత పెత్తనాలతో సమాఖ్య స్ఫూర్తిని భంగపరుస్తున్నారు. అదే తమ ఎన్నికల అవసరాలుంటే కాశ్మీర్‌లోనో బీహార్‌లోనో అయితే దానవీర శూర కర్ణలా లక్షల కోట్ల ప్యాకేజీలు ప్రకటించివచ్చారు(అక్కడా అమలు కాలేదన్నది వేరే విషయం)

అయితే ఇందుకు తెలుగుదేశం బాధ్యత కూడా తక్కువేమీ కాదు. కేంద్ర రాష్ట్రాలో ఇరుపార్టీలూ కలసి పాలన చేస్తున్నాయి. ఆర్థిక పరిస్థితి బాగాలేదని, అప్పులు పెరుగుతున్నాయని అధికారులు ఆర్థిక శాఖ గగ్గోలు పెడుతున్నా చంద్రబాబు, వెంకయ్య ఆయన పోటాపోటీగా పొగడ్తలు గుప్పించుకుంటూ ప్రజలను గందరగోళ పరిచారు.

బిజెపి ఇవ్వాల్సిన హోదాను వమ్ము చేస్తున్నా చంద్రబాబు పరమ విధేయత ప్రకటిస్తూ ఢిల్లీ ప్రదక్షిణలతో కాలహరణం చేశారు. అంతేగాని రాష్ట్రం కోసం అన్ని పక్షాలనూ సంఘాలనూ కలుపుకొని వత్తిడి తేవడానికి సిద్ధపడలేదు. ఒకప్పుడు రాష్ట్రాల హక్కుల కోసం ఉమ్మడిగా ఎలుగెత్తిన ఎన్టీఆర్, జ్యోతిబాసు, రామకృష్ణహెగ్డే వంటివారి వారసత్వానికి తిలోదకాలిచ్చేసిన పోరాటం వల్ల ఫలితం వుండదని తానే చేతులెత్తేశారు.

**నిజానికి ప్రత్యేక హోదా కోరుతూశాసనసభ 2015 సెప్టెంబరులో ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ప్రతిపక్ష వైసీపీ కూడా సహకరించింది. దాన్ని సాధించడానికి ప్రజలందరి ఉద్యమంగా అఖిలపక్ష అఖిలసంఘ నినాదంగా మార్చేబదులు ప్రభుత్వమే ఎక్కడికక్కడ నీరుగారుస్తూ వచ్చింది.**

**రాష్ట్రం తరపున ఏకోన్ముఖంగానూ గట్టిగానూ వాణి వినిపించలేని పరిస్థితి కల్పించింది.**

**రాజీపడేది లేదంటూనే అడుగడుగునా రాజీ పడింది. రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టుపెట్టింది.**

కెవిపి బిల్లును కూడా బలపరుస్తున్నామంటూనే మోడీ ప్రభుత్వాన్ని వదలిపెట్టి ఓడిపోయిన కాంగ్రెస్‌పై, వైసీపీ వామపక్షాలపై దాడిని కేంద్రీకరించింది.

## 8

ఈ నయవంచనపై రాష్ట్ర ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికింది. ప్రత్యేక హోదా అన్నది నూతన నినాదంగా మారింది.

దాంతో 2016 సెప్టెంబరులో మరో నూతన నాటకానికి తెరతీశారు.

అదే అరుణ్‌జైట్లీ ప్యాకేజీ ప్రహసనం. దానికి ముందు ఏదో కేంద్ర మంత్రులు పెద్ద కసరత్తు చేసినట్టు పదే పదే చర్చలు జరిపినట్టు పెద్ద తంతు నడిచింది. 7వ తేదీ అర్ధరాత్రి దాకా సాగదీసి పొడిపొడిగా, మొక్కుబడిగా నాలుగు ముక్కలతో ముగించేశారు.

ఆయన చెప్పిన ప్రకారమే రాష్ట్రానికి అన్ని విభాగాల కింద ఇచ్చిన మొత్తం దాదాపు 8,370 కోట్లు. ఇది ఒక ఏడాది రెవెన్యూ లోటుకు కూడా సరిపోదు. మొత్తం వివరాలకు వెబ్‌సైట్ చూసుకోమన్నారు. 14వ ఆర్థికసంఘం ఎలా ఆటంకమైందో అందులో చెప్పామన్నారు. వెబ్‌సైట్ చూస్తే ఏముంది? వెలవెలబోవలసి వచ్చింది. ఎందుకంటే ఇచ్చిందెంతో ఇవ్వలేకపోవడానికి కారణాలేమిటో దాంట్లో లేనేలేవు. అంతా మాటల గారడీ, హామీల బురిడీ.

జైట్లీ చెప్పిన విషయాలేమిటి?

**హోదా వల్ల వచ్చే దానికి ఇప్పుడు ఇచ్చేదానికి మధ్య తేడాను రీ ఇంబర్స్(చెల్లింపు) చేస్తాం. విదేశాల దగ్గర అప్పు తెచ్చుకుని పూర్తి చేసుకుంటే ఇఏపి(ఎక్స్టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టు) పథకాల ఖర్చుభరిస్తారట. ఇదెంత పెద్ద తలచుట్టు తతంగం? ప్రత్యేక పరిస్థితులుంటే కేంద్రం ఇలా చేయడం గతంలో వున్నదే. కొత్తగా చేసిందేమీ కాదు.**

**రెవెన్యూ లోటు లెక్క కట్టి ఇచ్చేస్తాం. లెక్కలు ఎన్నాళ్లు తేలుస్తారు? జైట్లీ ప్రకటన వచ్చి ఇన్నాళ్లయింది కదా ఏమైనా తేల్చారా? తేల్చరు. 2014 లెక్కలు ఇప్పుడు 2016 ముగుస్తున్నా తేల్చలేదు.**

**పోలవరం ప్రాజెక్టు ఖర్చు భరిస్తాం. కాని నిర్మించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. నివేదికలు అందిన మేరకు చెల్లింపులు చేస్తుంటాం– ఇదీ కొత్తదేమీ కాదు. మన్మోహన్ ప్రకటనలో వున్నదే. అయితే సమస్య నిధులకు సంబంధించింది. 30–40 వేల కోట్లు వ్యయం అయ్యే ఈ ప్రాజెక్టుకు రెండేళ్లలో 800 కోట్లు మాత్రమే ఇచ్చిన ఈ ప్రభుత్వం మిగిలిన సగం కాలంలో మాత్రం అందుకు భిన్నంగా ఏదో అద్భుతం చేస్తుందని ఎవరు నమ్ముతారు? అది కూడా విదేశీ అప్పు తెచ్చుకుంటే.**

**ప్రత్యేకహోదా పన్ను రాయితీల వల్ల వచ్చే మొత్తం ఏదో లెక్కకట్టి ఇచ్చేస్తాం.**

**ప్రత్యేకహోదాతో సమానమైన సహాయం అనడం బాగానే వుంటుంది గాని అది అశాస్త్రీయ వాదన. ఆ మొత్తాన్ని ఎలా లెక్క వేస్తారు? 40:60శాతం నిధుల పంపిణీని 90:10శాతంగా చూడటం ప్రతిసారీ సాధ్యమేనా? వ్యవసాయ ప్రధానమైన**

**ఎపిలో పారిశ్రామికీకరణకై టాక్స్ హాలిడే కింద 100 శాతం ఎక్సయిజ్,100శాతం ఐటి, 30 శాతం పెట్టుబడి సబ్సిడీ, 3 శాతం వడ్డీ సబ్సిడీ ఇవ్వాల్సి వుంటుంది. దీనికోసం ఏడాదికి 500 కోట్లు ఇస్తామంటే సరిపోతుందా? ఎవరికి ఇవ్వాల్సింది ఎవరికి ఇస్తున్నట్టు? ప్రోత్సహకాలు లేవని ఔత్సాహికులను వెనక్కునెట్టి బడా గుత్తాధిపతులకే పెద్ద పీట వేయదలచారా?**

**ఆర్థిక సంఘం నిబంధనలు తమకు ఎలా అడ్డంకి అయ్యాయో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. కాని అక్కడ ఇచ్చిన 2.29, 2.30 పేరాలు ఇచ్చారు. అందులో నిధుల పంపిణీకి సంఘం అనుసరించిన సూత్రాలు మాత్రమే వున్నాయి తప్ప హోదా నిరాకరణ వూసే లేదు.**

**వెబ్‌సైట్ ప్రకటనలోనూ దేనికీ క్వాంటిఫికేషన్(సంఖ్యా పరిమాణం) లేనేలేదు. మన్మోహన్ ప్రకటనలోని కెబికె ప్యాకేజీ గురించి గాని, హోదా కింద వచ్చే ప్రత్యేక రాయితీల గురించి గాని వెబ్‌సైట్‌లో పేర్కొనలేదు. అంటే వాటిని కూడా మినహాయించారు.**

మరి ఈ ప్యాకేజీ ప్రత్యేక హోదా కంటే మిన్న అని ఏ ఆధారంతో చెబుతున్నారు?

ఈ విషయమై వెంకయ్య నాయుడు మరో అడుగు ముందుకేసి పత్రికల్లో వ్యాసాలు రాశారు. ఛానళ్ల చుట్టూ తిరిగి నానా అవాస్తవాలు చెప్పారు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఇంత సాయం ఎవరికీ అందలేదట. ఎపిపై మోడీ ప్రభుత్వం 'వరాల వాన' కురిపించిందట. ప్రత్యేక హోదా అన్న పదం తప్ప దానివల్ల కలిగే ప్రయోజనాలన్నీ పొందుపరిచారట. ఎక్కడా ఎవరికీ ఇవ్వనట్టు వేలకోట్ల నిధులు మంజూరు చేశారట. ఇంతా చేసి తామిచ్చింది అన్నీ కలిపి 8370 కోట్లేనని మాత్రం ఒప్పుకోక తప్పలేదు. ఇది ఒక ఏడాది రెవెన్యూ లోటులో సగం కూడా కాదు!

మరోవైపు ఈ మాయదారి మాటలనూ మిథ్యా ప్యాకేజీని ముఖ్యమంత్రి చంద్రబాబు అర్ధరాత్రి మీడియాను పిలిచి మరీ స్వాగతించారు. ఇంతకాలం హోదాపై రాజీపడే ప్రసక్తిలేదనే అధినేత అమాంతం ఆసాంతం సాగిలబడిపోయారు. రక్తం మరిగిపోయిందన్నవారు మంచులా కరిగిపోయి ఆనందంతో పొంగిపోయారు. పోలవరంపై హామీ పూర్తిగా పాతదే అయినా ఏదో ఒరిగిపడిన వరప్రసాదమని అదేపనిగా పొగిడేశారు.

జైట్లీ రాజ్యసభలో ఇదే విషయాలు మాట్లాడినప్పుడు చాలా బాధ కలిగిందని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు ఈ మిథ్యా ప్యాకేజిని ఎందుకు ఎలా సమర్థించారన్నది పెద్ద వైరుధ్యం. ఎందుకంటే ఇందులో అదనంగా వచ్చిన ఒక్కపైసా కూడా లేదు.

వచ్చేదెంతో తెలియదు. ఆ ప్యాకేజీ ప్రకటన తర్వాత కూడా ఇప్పటికీ వచ్చింది లేదు. ఏదో విధంగా ఈ అధ్యాయాన్ని ముగించాలనే ఆదుర్దా కేంద్ర రాష్ట్రాలు బిజెపి టిడిపిలు హడావుడి పడటం, ఒకరినొకరు పొగుడుకుంటూ కప్పిపుచ్చుకుంటూ నడుపుతున్న రాజకీయ నాటకం అన్నది నిజం.

## 9

రాష్ట్ర ప్రజలు ఈ 'నయా'వంచనను అస్సలు భరించలేకపోయారు

**వైసీపీ, వామపక్షాలు, కాంగ్రెస్ 2016 సెప్టెంబరులో విడివిడిగా ఇచ్చిన బంద్ పిలుపునకు ప్రజలు బాగా స్పందించారు. అంతకు ముందు టిడిపి, బిజెపిలను బలపర్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కూడా నిరసన స్వరం వినిపించారు.**

**ఈ ఆందోళనలు వివిధ రూపాల్లో వివిధ వేదికలనుంచి కొనసాగుతూనే వున్నాయి. రాష్ట్ర యువత బుద్ధిజీవులు విద్యార్థులు నిరుద్యోగులు దీనిపై అసంతృప్తి మాత్రమే గాక ఆగ్రహంగానూ వున్నారు.**

**కాని బిజెపి, టిడిపిలు తమ రాజకీయ ప్రహసనం కొనసాగిస్తున్నాయి.**

**మాట తప్పినందుకు మొహం చాటేయాల్సింది పోయి వూరూరా సన్మానాలు చేయించుకుంటూ వూరేగుతున్నారు వెంకయ్య!**

**ఆయన తప్ప ఆంధ్ర ప్రదేశ్‌కు దిక్కులేదని స్తోత్ర పాఠాలు పాడుతున్నారు అనుకూల మీడియా వ్యాఖ్యాతలు.**

ఈ వూపులోనే వెంకయ్య నాయుడు విశాఖ సభలో మాట్లాడుతూ రాష్ట్రం వెలుగుల ఆంధ్ర ప్రదేశ్‌గా మారిపోయిందని ప్రకటించారు. ఒకప్పుడు భారత్ వెలిగిపోతుంది అని బిజెపి ఎన్నికలనినాదమిస్తే కడుపు రగిలిపోయిన ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి పంపించిన సంగతి ఆయన మర్చిపోయి వుండొచ్చు. అదే సభలో చంద్రబాబు నాయుడు కూడా వెంకయ్య నాయుడు రాష్ట్రానికి ఎంతో తెచ్చిపెట్టారని కీర్తించి పులకించిపోయారు.

ఇదంతా చూస్తుంటే ముళ్లపూడి వెంకట రమణ చెప్పిన స్వడబ్బా పరడబ్బా పరస్పర డబ్బా సిద్ధాంతం గుర్తుకు వస్తుంది. ఈ పరస్పర డబ్బా అమరావతి మలి శంకుస్థాపనలో పరాకాష్టకు చేరింది.

ప్రత్యేక హోదా తిరస్కరించడమే గాక అదేదో లాభం అనుకోవడం అజ్ఞానమని వీరంతా కొత్తభాష్యం చెబుతున్నారు. ప్యాకేజి అంతకన్నా చాలా ప్రయోజనమని తాడూ బొంగరం లేని వాదనలు చేస్తున్నారు.

నిజంగా ప్రత్యేక హోదా అంత దండగమారి వ్యవహారమేనా? ఇన్నేళ్ల అనుభవాలు ఇప్పటికే హెూదా కలిగివున్న 11 రాష్ట్రాల పరిస్థితులు ఎలా వున్నాయి?

అక్కడ అభివృద్ధి లేదా?

## 10

**దేశంలోని 29 రాష్ట్రాలలోనూ పదకొండు రాష్ట్రాలు ఇప్పటికీ ప్రత్యేక తరహా హోదా (స్పెషల్ క్యాటగిరీ స్టేటస్) కలిగివున్నాయి. (2017 వరకూ వుంటుంది కూడా) మొదటగా 1969లో జమ్మూ కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్ రాష్ట్రాలకు ఈ హోదా కల్పించారు. 1971లో హిమచల్ ప్రదేశ్‌కు హెూదా లభించింది. 1972లో మణిపూర్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాలను అస్సాం నుంచి విడదీసినప్పుడు వాటికి కూడా హోదా ఇచ్చారు. సిక్కింకు 1975లోనూ. అరుణాచల్ ప్రదేశ్‌కు మిజోరాంకు 1987లోనూ ఉత్తరాఖండ్‌కు 2001లోనూ ప్రత్యేక తరహా హోదా లభించింది. ఈ హోదా అన్నది ఒక్కసారిగా ఒకే కోణంలో ఇచ్చింది కాదు. ప్రకృతి అననుకూలతలు, చారిత్రిక నేపథ్యం, ఆర్థికాభివృద్ధిలో అసమాన పరిస్థితి వంటి కారణాల వల్ల మామూలు ప్రకారం పారిశ్రామిక పెట్టుబడులు వచ్చే అవకాశం లేనందువల్లనూ ఈ ప్రత్యేక హోదా ఇచ్చినట్టు అప్పట్లో కేంద్రం చెప్పింది.**

రాజ్యాంగంలో ప్రత్యేకంగా చెప్పకపోయినా దేశం వివిధ ప్రాంతాల ఆర్థిక భౌగోళిక పరిస్థితులలో హెచ్చుతగ్గులు గమనంలో పెట్టుకుని విధాన నిర్ణేతలు ప్రత్యేక తరహా హోదా అన్న దృక్పథం రూపొందించారు. అంతకు ముందు కాలంలో కేంద్రం నిర్ణయించే ఈ ప్రత్యేక సహాయ సహకారాలను 1969లో అప్పటి ఆర్థిక సంఘం చైర్మన్ వివిన్ గాడ్గిల్ నిర్దిష్టపరిచారు. 1980లో వాటిని మరోసారి సవరించారు. 1990లలో ప్రణాళికా సంఘ ఉపాధ్యక్షుడు ప్రణబ్ ముఖర్జీ మొత్తం నిబంధనలు క్రోడీకరించిన తర్వాత గాడ్గిల్ ముఖర్జీ ఫార్ములా అనే పేరు వచ్చింది. ఈ ఫార్ములా ప్రకారం కేంద్రం చేసే మొత్తం సహాయంలో 30 శాతం ప్రత్యేక హోదా రాష్ట్రాలకు అట్టిపెట్టి తక్కిన 70 శాతమే మిగిలిన రాష్ట్రాలకు పంచాలి.

మామూలుగా రాష్ట్రాలకు కేంద్రం చేసే సహాయంలో 30 శాతం సహాయంగానూ 70 శాతం అప్పుగానూ వుంటుంది. కాని ఈ ప్రత్యేకహోదా రాష్ట్రాలకు అప్పు పదిశాతమే వుండగా గ్రాంటు90 శాతం వుంటుంది. అంటే దాదాపు కేంద్రమే భరిస్తుంది.

ఆర్థిక సంఘం కేటాయింపులు చేయడమే గాని ప్రత్యేక తరహా హోదా అన్న మాట ఎక్కడా ఎప్పుడూ ఉపయోగించలేదు. కనుక ఇప్పుడేదో 14వ ఆర్థిక సంఘం ఆంధ్ర ప్రదేశ్ గురించి చెప్పలేదన్నది విపరీత వాదన మాత్రమే. ప్రణాళికా సంఘం సూచనల మేరకు ఆర్థిక సంఘం ప్రత్యేక రాష్ట్రాలకు ఆదనపు కేటాయింపులు చేస్తూ వచ్చింది.

దానికి ముందు అసలు ఈ హోదా మంజూరు చేసేది జాతీయ అభివృద్ధి మండలి(నేషనల్ డెవలప్ మెంట్ కౌన్సిల్– ఎన్‌డిసి) అక్కడా సిఫార్సు చేసేది ప్రణాళికా సంఘమే.

ఈ ప్రత్యేక హోదా కల్పించడానికి కొలబద్దలుగా అయిదు అంశాలు ప్రణాళికా సంఘం రూపొందించినట్టు 2006లో ఒక అధికార పత్రం వివరించింది.

**1. కొండ ప్రాంతాలతో కూడిన దుర్గమ పరిస్థితులు**

**2. జన సాంద్రత తక్కువగా వుండటం/ గణనీయమైన గిరిజన జనాభా**

**3. ఇరుగుపొరుగు దేశాలతో వ్యూహాత్మక సరిహద్దు ప్రాంతంగా వుండటం.**

**4. ఆర్థికంగానూ మౌలిక సదుపాయాలు(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పరంగానూ వెనుకబాటు**

**5. ఆర్థిక వనరుల కొరత. ఈ తరహాకు చెందిన రాష్ట్రాలలో కొన్నిసార్లు తలసరి ఆదాయం కొంతవరకూ బాగానే వున్నా అభివృద్ధి అవసరాలకు తగిన వనరులను సమీకరించుకోగల స్తోమత వుండకపోవడం.**

మామూలుగా కేంద్రం రాష్ట్రాలకు చేసే సహాయం నాలుగు రకాలుగా వుంటుంది. మొదటిది– సాధారణ కేంద్ర సహాయం (నార్మల్ సెంట్రల్ అసిస్టెన్స్– ఎన్‌సిఎ) రెండవది – ప్రత్యేక కేంద్ర ప్రణాళికా సహాయం (స్పెషల్ ప్లాన్ అసిస్టెన్స్ – ఎస్‌పిఎ) మూడవది – విదేశీ సహాయ ప్రాజెక్టులకు సహకారం(ఎక్సటర్నలీ ఎయిడెడ్ ప్రాజెక్టు – ఈఎపి) నాల్గవది – కేంద్రపథకాలు (సెంట్రలీ స్పాన్సర్డ్ స్కీమ్స్ – సిఎస్ఎస్ – ఇప్పుడివి పూర్తిగా ఎత్తివేశారు)

2002 నాటికి ఈ ప్రత్యేక తరహా కింద మొత్తం పదకొండు రాష్ట్రాలు అదనంగా సహాయం పొందాయి. వీటి పేర్లు–1. జమ్మూ కాశ్మీర్, 2.అస్సాం, 3.హిమచల్ ప్రదేశ్, 4. ఉత్తరాఖండ్, త్రి5.తిపుర,6. నాగాలాండ్, 7.మిజోరాం, 8.అరుణాచల్ ప్రదేశ్, 9.మణిపూర్, 10.మేఘాలయ,11.సిక్కిం

## 11

మొదట అస్సాం, కాశ్మీర్, నాగాలాండ్ రాష్ట్రాలకు పరిమితమైనప్పటికీ తర్వాత కేంద్ర పాలిత ప్రాంతాల హోదా పెరిగినప్పుడు, ఈశాన్యంలో కొత్త రాష్ట్రాలు ఏర్పాటవుతున్న కొద్దీ వాటికి ఈ హోదా ఇచ్చారు. బిజెపి ప్రభుత్వం 2000లో జార్ఖండ్, ఉత్తరాఖండ్, చత్తీష్‌గర్ రాష్ట్రాలను ఏర్పాటు చేసినప్పుడు ఉత్తరాఖండ్‌కు కూడా దీన్ని వర్తింపచేశారు. అలా అని తక్కిన రెండింటికీ ఇవ్వలేదు. కనక ఇక్కడ రాజకీయ విచక్షణాధికారం, ప్రత్యేకాంశాలను పరిగణనలోకి తీసుకోవడం పరిపాటిగా వస్తున్నది.

ఈ వివరాలను బట్టి చూస్తే రెండు విషయాలు స్పష్టమవుతాయి.

ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కల్పించడానికి రాజ్యాంగ రీత్యా ఎలాటి ఆటంకాలు లేవు. పైగా ఉన్న నిబంధనల ప్రకారం చూస్తే ఒక విధంగా కొన్ని అర్హతలు వున్నాయి.

జనాభా కొండ ప్రాంతాల వంటి వాటితో పాటు ఆర్థిక వనరుల కొరత, పెట్టుబడి సమీకరణ సమస్యలు అన్న కొలబద్దలు విభజనానంతర ఆంధ్ర ప్రదేశ్‌కు పూర్తిగా వర్తిస్తాయి.

వెనకబాటు తనం కోణంలో చూస్తే విభజన చట్టమే ఉత్తరాంధ్ర, రాయలసీమల్లోని ఏడుజిల్లాలను కేంద్రమే వెనకబడిన ప్రాంతాలుగా గుర్తించింది. వీటికి ప్రకాశంను కూడా కలపాల్సివుంటుంది. గిరిజన జనాభా చూస్తే విస్తారమైన ఏజన్సీ ప్రాంతం వుంది.

విదేశాలతో సరిహద్దులు అంటే తూర్పున బంగాళాఖాతం మొత్తం ఆ కోవకే చెందుతుంది.

ఇవన్నీ గాక అభివృద్ధి చెందినట్టు చెప్పే కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలు కూడా వ్యవసాయ ప్రధానమైనవి తప్ప పారిశ్రామిక కేంద్రాలు లేవు. ఒక్క విశాఖపట్టణంలోనే చెప్పుకోదగిన పారిశ్రామికీకరణ వుంది.

కాబట్టి విభజన కూడా జరిగిన తర్వాత ఏ కోణంలోనూ ప్రత్యేక హెూదాకు ఎపికి అర్హత లేదనడం అర్థం లేని విషయం. అన్యాయమైన వాదన.

## 12

అయితే అవసరాన్ని బట్టి మాటలు మార్చే అవకాశవాద నేతలకు నిజానిజాలతో నిమిత్తం వుండదు. ప్రత్యేకహోదా మా ఘనత అని వారు గొప్పగా ప్రచారం చేసుకున్నప్పుడు అది అమృతం. వాగ్దానాన్ని వమ్ము చేసి హెూదాను నిరాకరించాలని నిర్ణయించుకున్నాక అదే విషం. నిరర్థక వ్యవహారం. అసలు ఉపయోగమే లేకపోతే పొందేందుకు అర్హతలు లేకపోతే ఎందుకడిగారు? ఎందుకు గొప్పగాప్రచారం చేసుకున్నారు?అయిదేళ్లు పదేళ్లు పదిహేనేళ్లు అని వేలం పాటలా ఎందుకు పోటీ పడ్డారు? అంతా మోసమేనా? ఎన్నికల కోసం విసిరిన పాచికేనా?

వాస్తవం ఏమిటంటే ప్రత్యేక హోదా కింద చేసే ఆర్థిక సహాయం, పారిశ్రామికీకరణకు సంబంధించిన పన్ను రాయితీలు చాలా ప్రభావం చూపించాయి. ఇవేగనక లేకపోతే ఈశాన్య రాష్ట్రాలు గాని లేక కొండ ప్రాంతాల్లోని రాష్ట్రాలు గాని అసలు మనుగడ సాగించగలిగేవే కావు.

ప్రణాళికేతర సహాయంగా రెవెన్యూ లోటు భర్తీ కోసం 8 ప్రత్యేక హోదా రాష్ట్రాలకు 13వ ఫైనాన్స్ కమిషన్ ఇచ్చిన నిధుల వివరాలు కోట్లలో ఇలా

వున్నాయి(చివరలో వున్నది వారి మొత్తం రెవెన్యూ రాబడిలో ఈ సహాయం శాతం)

| | | | | |
|---|---|---|---|---|
| 1. | హిమచల్ ప్రదేశ్ | - | 1883 | 11.5 |
| 2. | మణిపూర్ | - | 1379 | 17.8 |
| 3. | మిజోరాం | - | 819 | 18.9 |
| 4. | మేఘాలయ | - | 1030 | 11.7 |
| 5. | త్రిపుర | - | 1030 | 14.4 |
| 6. | అరుణాచల్ | - | 623 | 9.6 |
| 7. | నాగాలాండ్ | - | 1719 | 26.4 |
| 8. | జమ్మూ కాశ్మీర్ | - | 3355 | 11.2 |

ఇంత స్పష్టంగా వివరాలు కనిపిస్తుంటే హోదా వల్ల పెద్దగా వచ్చేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన మంత్రులూ బిజెపి నేతలు చెప్పడం ఎంత హాస్యాస్పదం?ఇప్పుడు పెరిగిన సిఫార్సుల ప్రకారం ఇంకా చాలా రావలసి వుంటుంది.

ఈ మధ్యన కొత్తగా త్రిపురముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కూడా హోదా దండగన్నట్టు ఒక కథనం ప్రచారం చేశారు. నిజం ఏమంటే మాణిక్ సర్కార్ ప్రత్యేక హోదాపైనే గాక రాష్ట్రాలకు రావలసిన నిధులను మొత్తంగా పెంచాలని పోరాడుతున్నారు. రాష్ట్రాలకు 42 శాతం గాక 50 శాతం ఇవ్వాలన్నది ఆయన కోర్కె. దాంతోపాటు 14 వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమలులోకి రాకముందే ప్రత్యేక హోదా కొనసాగించాలంటూ లేఖ రాశారు. ఆయనే గాక మొత్తం ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు 2015 జూన్‌లో సమావేశమై దీనిపై ప్రధానికి లేఖ రాశారు. ఆ తర్వాత జూన్ 10న మాణిక్‌సర్కార్ నరేంద్ర మోడీని కలిసి హోదా రద్దు తగదని నొక్కి చెప్పారు. హోదావల్లే తమ రాష్ట్రానికి రూ॥ 23,000 కోట్ల నిధులు రాబట్టి నిలదొక్కుకోగలిగామని మిగిలిన ఈశాన్య రాష్ట్రాల పరిస్థితి కూడా అదేనని స్పష్టం చేశారు. 2015 మార్చిలోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో హోదా కొనసాగించాలని కోరుతూ అస్సాం శాసనసభ తీర్మానం చేసింది. బిజెపి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా సభలో దీనిపై తీవ్ర దుమారం రేగింది. ఇక్కడ చంద్రబాబు నాయుడు లాగే అక్కడ ముఖ్యమంత్రి హేమంత బిస్వాస్ హోదాకు సమానమైన మించిన రాయితీలు అంటూ చెబితే ఎవరూ విశ్వసించలేదు.

ఎవరో ఎందుకు, ఆర్థిక శాఖ సహాయ మంత్రి **నిర్మలా సీతారామన్** రాజ్యసభలో

కెపిత్యాగి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రత్యేక హోదా ప్రయోజనాలు వివరించారు.

**హోదా ఇచ్చాక ఈ పదమూడేళ్లలో హిమచల్‌లో(జనాభా 68 లక్షలు) దాదాపు 10,864 పరిశ్రమలు వచ్చాయనీ, రూ॥15,324 కోట్ల పెట్టుబడులతో 1,29,443 మందికి ఉద్యోగాలొచ్చాయనీ చెప్పారు. ఇక కోటి జనాభా గల ఉత్తరాఖండ్‌లో 30,224 పరిశ్రమలూ, రూ॥35,343 కోట్లపెట్టుబడులూ, 2,45,573 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వచ్చాయి.**

ఇదంతా ఎందుకు? **ఈ హోదా నిరాకరణ మింగించేందుకు తంటాలు పడిన కేంద్ర మంత్రి సుజనాచౌదరి స్వయానా ఈ రాయితీలను చూపి ఉత్తరాఖండ్‌లో యూనివర్సల్ ప్లాంట్ అనేది ఏర్పాటు చేశారే! పారిశ్రామిక వేత్తగా వుండి ఎంపి అయిన యువ సభ్యుడు గల్లా జయదేవ్ కూడా ఉత్తరాఖండ్‌లో తమ అమరరాజా బ్యాటరీస్ కోసం స్థలంకొన్నారే? అదే చోట శివశక్తి బయోప్లాంటెక్ యూనిట్ ఎందుకు పెట్టారు?ఇంకో ఎంపి సిఎం రమేష్ రాయితీలున్నాయనే కదా అక్కడెక్కడో ఈశాన్య రాష్ట్రాల్లో విద్యుత్ ప్లాంట్ నెలకొల్పారు!**

పర్వతమయమైన హిమచల్ ప్రదేశ్‌లో రెడ్డీస్ ల్యాబొరేటరీ, హెటిరో డ్రగ్స్, అరబిందో ఫార్మా, ర్యాన్ బాక్సీ, సిప్లా, టొరెంటో, పనాసియా, క్యాడిలా వంటి ఫార్మా దిగ్గజాలు నెలకొన్నాయి. నెస్లే, దాబర్, వర్ధమాన్, బిర్లా, టీవీఎస్ మోటర్స్, ఏసీసీ, అంబుజా, మైక్రోటెక్, లాంటివన్నీ వున్నాయి.

ఉత్తరాఖండ్‌లోనూ రాకపోకలు సరిగ్గాలేని కొండ ప్రాంతమైనా హిల్ట్రాన్, హెచ్‌సీఎల్, విప్రో, బ్రిటానియా, డాబర్, హిందూస్తాన్ యూనీ లివర్, మహీంద్రా అండ్‌మహీంద్రా, టాటా మోటార్స్, తదితర ప్రముఖ సంస్థల యూనిట్లున్నాయంటే పన్ను రాయితీలే కారణం.

## 13

ఈ రాయితీలు ఇవ్వడం పారిశ్రామిక వేత్తలకే లాభం అనుకుంటే పొరబాటు. పెట్టుబడులు రాకతో ఉత్పత్తి వల్ల ఉపాధి అవకాశాలు పెరగాలనేదే ఇక్కడ వ్యూహం. **ప్రపంచ వ్యాపితంగా జరిగిన అధ్యయనాలలో పెట్టుబడులు పెట్టేవారు ఏ ప్రాంతం ఎంచుకుంటారంటే పన్నుల పరంగా ఆదాయం మిగిలే చోటకు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అధికంగా వుండే చోటకు వెళ్లేందుకు ఉత్సాహం చూపిస్తారు. కొన్ని అననుకూలతలు వున్నా పెట్టుబడులు రావాలంటే వారికి ప్రోత్సాహకాలు వుండాలి.** 1860-1947 మధ్య కాలంలో అంటే స్వాతంత్రానికి పూర్వమే ఈ పరిస్థితి వుందని తవర్జా చేసిన పరిశోధన నిరూపించింది. అమెరికాలో బాల్టిక్ 1991లో జరిపిన అధ్యయనం ప్రకారం పన్ను రాయితీ ఒకశాతం వుంటే పెట్టుబడుల పెరుగుదల 10 నుంచి 30 శాతం

వుంటుందని తేలిపింది. ఇంకా పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన జపాన్, బ్రిటన్‌ల నుంచి పూర్టరికో, బ్రెజిల్ వంటి చిన్న దేశాల అనుభవం కూడా అలాగే వుంది. ప్రోత్సాహకాలు అక్కడ పెద్ద పాత్ర వహించాయని రామచంద్రన్. కె. అధ్యయనం తేల్చింది. మన దేశంలో పారిశ్రామికంగా పేరొందిన మహారాష్ట్ర, గుజరాత్‌ల్లో జె.పరంజపే 1988లో జరిపిన అధ్యయనం కూడా ఇదే చెప్పింది. **చంద్రబాబు నుంచి మోడీ వరకూ పరమ ప్రామాణికంగా పరిగణించే ప్రపంచ బ్యాంకు కూడా మూడు ఐ లు - ఇన్సిస్టిట్యూషన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్సెంటివ్స్ వుంటేనే పారిశ్రామికీకరణ, జరుగుతుందని 2009లో నివేదించింది.అదే ఏడాది ఐక్యరాజ్యసమితి అధ్యయనం కూడా అలాటి సిఫార్సే చేసింది.**

ఇవన్నీ గమనంలోకి తీసుకున్నాకే ప్రత్యేక హోదా రాయితీల వంటి సదుపాయాలు రూపొందాయి.వీటి ఫలితాలు కూడా గణనీయంగా వున్నాయి. 2012లో ప్రణాళికా సంఘం ఉత్తరాఖండ్, హిమచల్, కాశ్మీర్‌లలో ప్రత్యేక హోదా రాయితీల ప్రభావంపై అధ్యయనం చేయించింది. హిమచల్ ప్రదేశ్‌లోని త్రివేణి పరిశోధనా సంస్థకు అనుబంధమైన స్టెల్లార్‌సొసైటీ ప్రణాళికా సంఘ ప్రాయోజకత్వంలో జరిపిన ఈ సుదీర్ఘ అధ్యయన నివేదిక మూడు రాష్ట్రాల్లోనూ పారిశ్రామికీకరణ, ఉపాధి, సంపద పెరుగుదల వివరాలు నిర్దిష్టంగా అందజేసింది. ఈ అధ్యయనంలో భాగంగా అధికారిక పత్రాలు నివేదికలు మాత్రమే గాక పెట్టుబడులు పెట్టిన వారిని కూడా విస్తారంగా ఇంటర్వ్యూలు చేసి అభిప్రాయాలు సేకరించారు.

జమ్మూ కాశ్మీర్‌లో రూ॥1989 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 59,621 మందికి ఉద్యోగాలు దొరికాయి. 8091 యూనిట్లు ఏర్పడ్డాయి. ఫ్యాక్టరీల సంఖ్య శాతంగా చూస్తే 15.15శాతం పెరుగుదల వుంది. స్థిరపెట్టుబడి 91శాతం పెరిగింది. మొత్తం పెట్టుబడులు 84శాతం పెరిగాయి.

హిమచల్‌లో రూ॥10,104 కోట్ల పెట్టుబడులు రాగా 95,618 మందికి ఉద్యోగాలు వచ్చాయి. 7606 యూనిట్లు నెలకొన్నాయి. ఫ్యాక్టరీల శాతం 25.70 పెరిగింది. స్థిరపెట్టుబడి 85శాతం పెరిగింది. మొత్తం పెట్టుబడులు 85 శాతం పెరిగాయి.

అందరికంటే ఎక్కువగా ఉత్తరాఖండ్‌లో రూ॥ 23,915 కోట్ల పెట్టుబడులు, 1,61,610 ఉద్యోగాలు, 16,102 యూనిట్లు కనిపిస్తున్నాయి. ఫ్యాక్టరీలు ఇక్కడ 27.79శాతం పెరిగాయి. స్థిరపెట్టుబడి162 శాతంపెరిగింది. మొత్తం పెట్టుబడులు139 శాతం పెరిగాయి.

అభివృద్ధి శాతం చూస్తే 2008-09లో ఉత్తరాఖండ్‌లో 134, హిమచల్‌లో 28, జమ్మూ కాశ్మీర్‌లో 57శాతంగా వుంది. నికరంగా కలిసిన విలువ మొత్తం ఉత్తరాఖండ్‌లో 338 శాతం వుంది. దీని విలువ రూ॥28,43,285. ఇది హర్యానా కంటే ఎక్కువ. హిమచల్‌లో ఇది రూ॥13,33,237గా, 139 శాతంగా వుంది. ఇది పంజాబ్‌ను దాటిపోయింది. ఇక జమ్మూ కాశ్మీర్ అంకెలు అందుబాటులో లేవు గాని శాతంగా చూస్తే 278 వుంది.

అస్సాంను తీసుకుంటే దారిద్ర్యం శాతం 1973-74లో 51 శాతం వుంటే 2010-11కు 32 శాతానికి వచ్చింది. కేంద్ర నిధుల కారణంగా విద్య వైద్యం వంటి సామాజిక సూచికలు మెరుగుపడ్డాయని ప్రణాళికా సంఘం తేల్చింది. కేంద్రం ప్రత్యేక సహాయమే లేకపోతే ఇది జరిగేది కాదని నిపుణులు నిర్ద్వంద్వంగా తేల్చిచెప్పారు. ప్రోత్సాహకాలు ఇచ్చినా పరిశ్రమల రంగంలో పురోగతి ఇక్కడ అంతగా లేదన్నది అధ్యయనాల సారం. చమురు సహజవాయువు తదితర ప్రకృతి వనరులు పుష్కలంగా వున్న రాష్ట్రమైనా బంగ్లాదేశ్ నుంచి భారీ వలసలు, రాజకీయ అస్థిరత దాని అభివృద్ధికి శాపంగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి ప్రత్యేక సహాయమే లేకపోతే అసలు ఒక రాష్ట్రంగానే మనగలిగేది కాదంటారు

కాగ్ కార్యాలయం డైరెక్టర్ జనరల్ గోవింద భట్టాచార్జీ తన పుస్తకంలో(ఆక్స్‌ఫర్డ్ ప్రచురణ) ఇక నాగాలాండ్ 1970,80లలో వున్న పరిస్థితిని దృష్టిలోకి తీసుకుంటే ఈ ప్రత్యేక హెూదా వల్ల గణనీయమైన ప్రగతి సాధ్యమైందంటారు. జాతీయ స్థాయిలో సగటున 27.5శాతం వున్న దారిద్ర్య శాతం నాగాలాండ్‌లో39 శాతం నుంచి 19 శాతానికి తగ్గింది. పారిశ్రామికాభివృద్ధి లేకున్నా ప్రభుత్వ కార్యకలాపాలు పెరగడం వల్ల ఇది సాధ్యమైంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ రాష్ట్రంలో 80 శాతం అక్షరాస్యత సాధించారు.

## 14

ప్రత్యేక తరహా హోదా వల్ల ఉద్యోగాలు, వాటికి లభిస్తున్న జీతనాతాలు ఆదాయలు ఎలా వున్నాయో కూడా చూడొచ్చు.

అన్నిటికన్నా కీలకమైన ఉద్యోగితను పరిశీలిస్తే ఈ కాలంలో ఉత్తరాఖండ్‌లో 87 శాతం, హిమచల్‌లో 39 శాతం, జమ్మూ కాశ్మీర్‌లో 22 శాతం ఉపాధి, ఉద్యోగాలు పెరిగాయి. కార్మికులకు అందే ప్రతిఫలం ఉత్తరాఖండ్‌లో 172 శాతం, హిమచల్‌లో 94శాతం, కాశ్మీర్‌లో 47 శాతం పెరుగుదల వుంది. వాస్తవంగా ఈ మూడు రాష్ట్రాల కంటే అభివృద్ధిచెందిన పంజాబ్ హర్యానా యుపి వంటి చోట్లనుంచి

కూడా ఈ ప్రత్యేక హోదా రాష్ట్రాలకు వచ్చి పనులు చేసుకుంటున్నారు. స్థానికంగా ఒకోసారి పనివారి కొరత కూడాఎదురవుతున్నదని యజమానులు చెబుతున్నారు.

ఈ మూడు రాష్ట్రాలలోనూ పెట్టుబడులు పెట్టినవారిని విచారించగా 89శాతం మంది తాము ఈ రాయితీలు వున్నందునే వచ్చామని సమాధానమిచ్చారు. 66. 7శాతం మంది ఇంకా పెట్టుబడులు పెట్టాలనే ఉత్సాహం కనబర్చారు. ఇవి పోటీకి దోహదం చేశాయని 88 శాతం మంది చెప్పారు. వీరిలో 44 శాతం మంది తమ యూనిట్లను విస్తరించుకునే యోచనలో వున్నారు. అదే సమయంలో తమకు ఇచ్చే రాయితీలు త్వరగా విడుదల చేయాలనీ, వాటికి సంబంధించిన కాలవ్యవధిపై ఒప్పందం వుండాలనీ, ఒకసారి ఇచ్చిన రాయితీలను ముందస్తు అవగాహన లేకుండా మార్చరాదని కూడా పారిశ్రామికవేత్తలుచెబుతున్నారు

కాబట్టి ప్రత్యేక హోదా వల్ల ప్రయోజనం వుండదనే వాదన అర్థం లేనిదే కాదు, కావాలని చేస్తున్న అసత్య ప్రచారం.

## 15

పైన పరిశీలించిన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్ర ప్రదేశ్ అనేక అనుకూలతలు కలిగివుంది. సుదీర్ఘ సముద్రతీరం, ప్రకృతి వనరులు, రవాణా సదుపాయాలు, సారవంతమైన భూములు, కష్టపడే చదువుకునే యువత, రాజకీయ స్థిరత్వం, పరిపక్వ నాయకత్వం అన్నీ వున్నాయి. ఇలాటి రాష్ట్రానికి గనక ప్రత్యేక రాయితీలు కల్పించి ఆర్థిక సహాయం అందిస్తే వాటికన్నా త్వరితంగా అభివృద్ధి చెందగలుగుతుంది.

ఇటీవల వరుసగా కొనసాగే కరువు పరిస్థితులు, వ్యవసాయ సంక్షోభాలు, విభజన నేపథ్యంలో సంపదలూ, అవకాశాలు కేంద్రీకరించిన పూర్వ రాజధాని హైదరాబాద్ లేకుండా పోవడం, నీటి పారుదల సమస్యల పెరుగుదల దృష్ట్యా ఆంధ్ర ప్రదేశ్‌లో సత్వర పారిశ్రామికాభివృద్ధి మరింత అవసరమవుతుంది. తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం సమతుల్యత ప్రజాశ్రేయస్సుకే గాక దేశానికి కూడా మేలు చేస్తుంది. ప్రత్యేక హోదా లేకుండా అవన్నీ జరగవు గనకే ఇచ్చిన వాగ్దానం అమలు చేయమని అందరూ కోరుతున్నారు.అంతేతప్ప ప్రత్యేక హోదా వస్తే స్వర్గం దిగిపోతుందని ఎవరో చెబుతున్నట్టు చిత్రించడం టిడిపి, బిజెపి దుష్ప్రచారం మాత్రమే. నిజానికి ఎన్నికల తరుణంలో ఆ విధంగా ప్రచారం చేసింది వారే! ప్రతిపక్షాలు ప్రజలూ మేధావులు చెబుతున్నది హోదా వస్తే ఇక్కడ పెట్టుబడులు రావడానికి ఉపాధి అవకాశాలు పెరగడానికి అవకాశం ఏర్పడుతుందని. అప్పుడూ సమస్యలు వుండొచ్చు. వున్నాయని కూడా అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ వ్యవస్థలో ఈ ప్రభుత్వాల నిర్వాకాల కారణంగా సమస్యలు ఎలాగూ వుంటాయి.కాని పరిశ్రమలూ

ఉపాధి అవకాశాలూ జీవన ప్రమాణాలూ సామాజిక సూచికలూ మెరుగుపడ్డాయని ప్రత్యేక హోదా రాష్ట్రాలపై జరిగిన అన్ని అధ్యయనాలూ ఎలా చెబుతున్నది చూశాం. ఇంతకు ముందు మనం చెప్పుకున్న గోవింద భట్టాచార్జీ ప్రత్యేక హోదాకు పెద్ద అనుకూలుడేమీకాదు ప్రత్యేక హోదా విషయంలో సమగ్రదృష్టితో వ్యవహరించనందుకు కేంద్ర ప్రభుత్వాన్ని,మరీ ముఖ్యంగా ప్రణాళికా సంఘాన్ని ఆయన తప్పు పట్టారు. అలాగే ఆయా రాష్ట్రాల్లో పాలనా లోపాలను కూడా పేర్కొన్నారు. అయితే ఆయన కూడా దీని విలువను పూర్తిగా అంగీకరించారు. రెవెన్యూ లోటును అధిగమించడానికి, పెట్టుబడులు ప్రభుత్వ వ్యయ కార్యకలాపాలు పెరగడానికి, కొన్ని రాష్ట్రాలైనా స్వయం సమృద్ధి సాధించడానికి ప్రత్యేక హోదా బాటవేసిందనన్నది ఆయన ముగింపులో చెప్పే అంశం. వాటి రుణభారం కూడా తగ్గింది.

**ఏది ఏమైనా ఈ రాష్ట్రాల ఏర్పాటు తరుణంలోవారసత్వంగా సంక్రమించిన అనేక వెనుకబాటుతనాలు తగు వనరుల సమర్థత లేకపోవడం కారణంగానే అవి నిలదొక్కుకోవడం కోసం ప్రత్యేక తరహా హోదా ఇవ్వడం జరిగిందనేది కాదనలేని విషయం. ఈ ఆర్థికంగా ఈ మద్దతు లభించివుండకపోతే చిన్న పరిణామం, అరకొర వనరులు, ఉత్పాదక సామర్థ్య లేమి నేపథ్యంలో అవి రాష్ట్రాలుగా మనగలిగేవే కావు. అనేక ప్రత్యేక తరహా రాష్ట్రాలు ఆవిర్భావ తరుణంలో ఆర్థికంగానూ రాజకీయంగానూ కూడా నిలబడగల స్థితిలో వుండేవి కావు. ఎందుకంటే రాజకీయ ఉనికి అనేది ఆర్థిక స్థోమతపై ఆధారపడి వుంటుంది. కాబట్టి ఏదో రూపంలో ఆ నిలదొక్కుకునే స్థోమత కల్పించగల యంత్రాంగం అవసరమైంది. ప్రత్యేక హోదా అలాటి ఒక ఏర్పాటే. ప్రత్యేక తరహా హోదానే గనక లేకపోతే ఈ రాష్ట్రాలు ఇప్పుడు తాము సాధించిన ప్రమాణాలు చేరుకోగలిగేవి కావు. ఈ హోదా కారణంగానే వాటిలో సగం రాష్ట్రాలు సామాజిక ఆర్థికాభివృద్ధిలో 2010-11 నాటికి జాతీయ సగటును చేరుకోగలిగాయి. (పేజీ 459)**

మరీ ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్‌కు ఆ అర్హత వుందని గోవింద భట్టాచార్జీ అభిప్రాయపడ్డారు!

**...'2012-13 లెక్కల ప్రకారం ఆంధ్ర ప్రదేశ్‌కు తన రెవెన్యూ రాబడి 11,662 కోట్లు వుండగా ఖర్చు రూ॥60,750 కోట్ల రూపాయలుంది. దానికి రూ॥60,750 కోట్లు అప్పు వారసత్వంగా వచ్చింది. తెలంగాణకు రూ॥56,476 కోట్ల రెవెన్యూ రాబడి వుంటే ఖర్చు రూ॥42,376 కోట్లు, సంక్రమించిన అప్పు రూ॥65,832 కోట్లు మాత్రమే. అయితే ఈ మొత్తం ఏర్పాట్లలో అసమతుల్యత దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఎందుకంటే తెలంగాణాలో సంపన్నవంతమైన రెండు జిల్లాలు**

హైదరాబాద్,రంగారెడ్డి ఆదాయం కలిపి రూ॥51,478 కోట్లు. లేదా మొత్తం ఆ రాష్ట్ర రెవెన్యూ రాబడిలో 91 శాతం ఇదే.అదే ఖర్చుకువచ్చే సరికి ఈ రెండు జిల్లాల వ్యయం రూ॥23,302 కోట్లు లేదా రాష్ట్ర మొత్తం వ్యయంలో 48శాతం మాత్రమే. దీని ఫలితమేమంటే ఆంధ్ర ప్రదేశ్ తన స్వంత ఆదాయం దాని వ్యయ అవసరాలలో అయిదో వంతుకుకూడా చాలక మరింతగా క్షీణించడమే జరుగుతుంది. వారసత్వంగా వచ్చిన భారీ రుణభారం ఈ పేద రాష్ట్రంపై చెల్లింపుల గుదిబండగా మారుతుంది. దీన్నిబట్టి చూసినప్పుడు తప్పనిసరిగా ప్రత్యేక తరహా హోదా కల్పన విషయం చేపట్టవలసి వుంటుంది.(పేజి468– ఇది 58:42 నిష్పత్తి ప్రకారం లెక్కకట్టానని తెలిపారు)

## 16

ఇవే గాక ఇంకా అనేక అధ్యయనాలు పరిశోధనలూ మదింపులూ కూడా ప్రత్యేక తరహా హోదా వల్ల కలిగిన ప్రయోజనాలను ముఖ్యంగా ప్రజల జీవన ప్రమాణాలకు ఉపాధి అవకాశాలు జీత భత్యాల పెరుగుదలకూ అదెలా దోహదపడిందో స్పష్టం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలోనే విభజన సమయంలో ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేకహోదా గురించి వాగ్దానం చేశారు. ఇప్పుడు వమ్ము చేస్తున్నారు. అనేక రకాల వంచన జరుగుతున్నది

మొదటిది– తామిచ్చిన వాగ్దానాన్ని చేసుకున్న ప్రచారాన్ని తామే వమ్ము చేయడం.

రెండు– ఆర్థిక సంఘం, నీటి ఆయోగ్ అంటూ అసత్యపు సాకులుచెప్పడం.

మూడు–హోదాను మించిన ప్యాకేజీ అంటూ హోదాకే గాక నాడు వాగ్దానం చేసిన ప్యాకేజీలకు కూడా మంగళం పాడటం.

నాలుగు –చేస్తామన్న చేశామన్న సహాయం కూడా మంజూరు చేయకపోవడం.

అయిదు– ఏమీ చేయకుండానే ఏదో చేశామన్న భ్రమ కల్పించడం, అసత్యాలు ప్రచారంలో పెట్టడం.

ఆరు– వాగ్దానభంగానికి గురైన ప్రజలను అవమానించేలా మాట్లాడ్డం.

ఏడు–విశ్వాస ఘాతుకానికి కారకులైన వారినే గొప్పగా సన్మానాలు చేసి వూరేగించడం.

ఎనిమిది– రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకహోదా సాధన కోసం ప్రజలను ప్రతిపక్షాలను విశ్వాసంలోకి తీసుకోకుండా కేంద్రానికి భజన చేయడం.

తొమ్మిది– అందుకోసం పోరాడుతుంటే నిర్బంధానికి పాల్పడ్డం.

పది–విభజనకు తోడు విధానతప్పిదాలతో అవాస్తవ ప్రచారాలతో నిరాశావాతావరణం సృష్టించడమే గాక నిందలు వేయడం.

పదకొండు: ప్రత్యేక హోదాపై ప్రభుత్వ ధనంతో అసత్య ప్రచారాలు చేయడం, అధికార వేదికలను రాజకీయ వేదికలుగా వాడుకోవడం.

పన్నెండు: తేర్థిక అవసరాల పేర విదేశీ స్వదేశీ కార్పొరేట్లకు సర్వం కట్టబెట్టడానికి కేంద్రం వైఖరిని వాడుకోవడం.

ఇవేగాక ఇంకా చాలా కఠోర సత్యాలూ చెప్పుకోవచ్చు. మాటమార్పిళ్లు పిల్లిమొగ్గలూ పెద్ద చేంతాడంత జాబితా ఇవ్వొచ్చు. కాని అవన్నీ ప్రజలు చూస్తున్నవే గనక పునరావృతం చేయడం లేదు.

కింకర్తవ్యం అన్నదే ఇక్కడ ప్రశ్న.

## 17

మన్మోహన్ నోరు విప్పని ప్రధాని అని ఎగతాళి చేసేవారు. ఆయన పాలనలో చాలా అవకతవకలూ ఆరోపణలూ వున్న మాట నిజమే. కాని తర్వాత వచ్చిన నరేంద్ర మోడీని నిజమైన ప్రజా నాయకుడుగా , సర్వశక్తిమంతుడైన ప్రధానిగా బిజెపి ప్రచారం చేస్తుంటుంది. ఆయనే ఎన్నికల ప్రచారంలో తల్లిని చంపారు బిడ్డను బతికించారు అని ఏవేవో సెంటిమెంటు డైలాగులు చెప్పారు. కాని ఆంధ్ర ప్రదేశ్‌కు సంబంధించి మాత్రం ఆయన మన్మోహన్‌ను మించిపోయారు. మౌ'నరేంద్రమోడీగా మారిపోయారు. ఇంతవరకూ ప్రత్యేక హోదా విషయమై పెదవి మెదపలేదంటే అహంభావపూరితమైన వివక్ష కాకమరేమిటి?

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్న వారు అది ఇచ్చిన మేరకు కూడా హామీలు అమలు చేయక పోవడం మరెంత దారుణం?

ఆ రోజు ప్రతిపక్షంలో వుండి నిరాహారదీక్షలు చేసిన ముఖ్యమంత్రి ఇప్పుడు తనే అధికారంలో వుండి ఎందుకు అసహాయత నటిస్తున్నారు? అడిగినవారిపైనే ఎందుకు దాడి చేస్తున్నారు?

తామే తుమ్మి చిరంజీవ అనుకున్నట్టు తామే హోదాను తిరస్కరించి ముగిసిన అధ్యాయం అని ప్రకటిస్తే ప్రజలు మౌనంగా వుంటారనుకోవడం బిజెపి, టిడిపిల, భ్రమ మాత్రమే.

ఎవరో ఏకపక్షంగా ముగిస్తే ముగిసిపోవడానికి ఇది నాటకం కాదు, సినిమా కాదు. రియాల్టీ షో అంతకన్నా కాదు.

నిజానికి అసలు కథ ఇప్పుడే మొదలవుతుంది.

తమకు పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన వాగ్దానం వమ్ము చేసిన ప్రత్యేక వంచకులపై ప్రజా ఉద్యమం ప్రజ్వరిల్లుతుంది. ప్రతిపక్షాలూ ప్రజా సంఘాలూ ప్రజాస్వామిక వాదులూ యువజన విద్యార్థులూ తమ సమరశీల చైతన్యం చూపిస్తారు.

హోదా భూస్థాపితం చేశామనుకున్న వారి మెడలు వంచి మరీ వాగ్దానం అమలు చేయించుకుంటారు. కాబట్టి ఇది ముగింపు కాదు, కానేకాదు. ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం నిస్సహాయంగా చూస్తూ వూరుకోదు. కొత్తచరిత్ర మొదలు పెడుతుంది. అందుకే-

అంతం కాదిది ఆరంభం. ఆంధ్రప్రదేశ్ సమర శంఖం.

✶ ✶ ✶

ప్రత్యేక హోదా
ప్రజా గర్జన

ప్రత్యేక హోదా
ప్రజా ఉద్యమం

ప్రత్యేక హోదా
ప్రభుత్వాల వెన్నుపోటు

▲

ముద్రణ : నవంబర్, 2016 వెల : ₹ . 5/-

**ప్రచురణ**
భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్
**ప్రతులకు**
ప్రజాశక్తి బుక్‌హౌస్
27-1-64, కారల్‌మార్క్స్ రోడ్,
విజయవాడ -520 002, ఫోన్ : 0866 - 2577533
**ముద్రణ**
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ